# నేటి ప్రస్థానం

తెలుగు దిన పత్రిక

APTEL/2013/54506



## రిపోర్టర్స్ కావలెను

నిజాలు నిర్భయంగా రాసే సత్తా ఉండి.. ఎలాంటి భయం.. పక్షపాతం అన్నది లేకుండా ఉన్నది ఉన్నట్లు రాయగలిగే రిపోర్టర్లు కావలెను. మీలో ఈ సత్తా ఉంటే కింది నెంబర్లకు రెజ్యూమో పంపండి.

95150 34555

84979 20544




ఎడిటర్: ఐతగోని రాఘవేంద్ర | ఆదివారం, 13 ఏప్రిల్ 2025 | సంపుటి: 12 | సంచిక: 31 | పేజీలు: 4 | వెల:10/-


# వనజీవి రామయ్య అస్తమయం

గుండెపోటుతో శనివారం ఉదయం మృతి

కోటి మొక్కలు నాటి రికార్డు సృష్టించిన ప్రకృతి ప్రేమికుడు



**నేటి ప్రస్థానం, ఖమ్మం:** మొక్కలే శ్వాసగా.. మొక్కలే జీవితంగా.. మొక్కలే ప్రాణంగా బతికిన ప్రముఖ సామాజిక కార్యకర్త, పద్మశ్రీ వనజీవి రామయ్య కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రామయ్య శనివారం ఉదయం గుండెపోటు రావడంతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఆయనను ఖమ్మం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్సపొందుతూ తుదిశ్వాస విడిచారు. రామయ్య స్వస్థలం ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి గ్రామం. జీవితమంతా మొక్కలు నాటి పెంచారు. కోటికిపైగా మొక్కలు నాటి సరికొత్త చరిత్ర సృష్టించారు. వృక్షో రక్షతి రక్షితః అంటూ నిత్యం ప్రచారంచేసిన ఆయన రోడ్ల పక్కన, పాఠశాలలు, దవాఖానలు, దేవాలయాల్లో మొక్కలు నాటారు. రామయ్య సేవలకుగాను 2017లో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించింది. రామయ్యకు భార్య, ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. కాగా ఇద్దరు కుమారులు ఇప్పటికే వివిధ కారణాలతో చనిపోయారు. రామయ్య మృతితో ప్రకృతి ప్రేమికులు శోక సంద్రంలో మునిగిపోయారు. రామయ్యను కడసారి చూడటానికి జనం భారీగా తరలి వచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, బీఆర్ఎస్ మాజీ ఎంపీ సంతోష్ సహా పలువురు రాజకీయ నేతలు సంతాపం తెలిపారు. 1937, జూలై 1న దరిపెల్లి లాలయ్య, పుల్లమ్మ దంపతులకు రామయ్య జన్మించారు. ఆయన ఇంటిపేరు దరిపల్లి రామయ్య అయినప్పటికీ వనజీవిగా మార్చుకున్నారు. ఆయనను చెట్ల రామయ్య అనికూడా పిలుస్తారు. 50 ఏండ్లుగా అలుపెరగకుండా విత్తనాలు చల్లుతూ మొక్కలు పెంచేందుకు ప్రయత్నించారు. తెలంగాణ ప్రభుత్వం ఆరో తరగతి సాంఘీకశాస్త్రంలో వనజీవి గురించి పాఠ్యాంశంగా చేర్చింది. అదేవిధంగా మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి తెలుగు విద్యార్థుల కోసం 9వ తరగతి తెలుగు పుస్తకంలో రామయ్య జీవితం పాఠ్యాంశంగా బోధిస్తున్నది. ఓవైపు కుటుంబ భారాన్ని మోస్తూనే.. నాలుగు దశాబ్దాలకు పైగా మొక్కలు నాటుతూ వచ్చారు. మనుమళ్లు, మనుమరాళ్లకు చెట్ల పేర్లే చందనపుష్ప, హరిత లావణ్య. కుబంధపుష్ప, వనశ్రీ అని పెట్టారు. కోటికిపైగా మొక్కలను నాటి ట్రీ మ్యాన్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందిన రామయ్య సేవలకుగాను పలు సంస్థలు అవార్డులతో సత్కరించాయి. 2005లో సెంటర్‌ఫర్ మీడియా సర్వీసెస్ సంస్థ నుంచి మనమిత్ర అవార్డులో ఇచ్చింది. యూనివర్సల్ గ్లోబల్ పీస్ అనే అంతర్జాతీయ సంస్థ ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసింది. 1995లో భారత ప్రభుత్వం నుంచి వనసేవా అవార్డు లభించింది.



- టెక్ కంపెనీల్లో ఉద్యోగాల తొలగింపు
- పింక్ స్లిప్‌లతో ఉద్యోగుల బేజారు
- ఉద్యోగుల్లో పెరుగుతున్న అభద్రతాభావం
- వందలాదిమందికి గూగుల్ లేఆఫ్‌లు
- పెరుగుతున్న ఏఐ వాడకంతో ఉద్యోగాలకు ఎసరు
- ఆర్థిక మందగమనం మరోవైపు
- ఖర్చుల తగ్గింపు కారణాలతో జాబ్స్‌లో కోత

# ఉద్యోగాల ఊచకోత


టెక్ కంపెనీల్లో ఉద్యోగాలు మళ్లీ ఊడుతున్నాయి. గ్లోబల్ ఎకానమీ మందగమనం, ఖర్చుల తగ్గింపు కారణాలతో దిగ్గజ కంపెనీలు ఉద్యోగులను ఎడాపెడా తొలగిస్తున్నాయి. గూగుల్ నుంచి అమెజాన్ వరకు అందరిదీ అదే బాట. ఎప్పుడు పింక్ స్లిప్ చేతికి వస్తుందో తెలియక ఉద్యోగులు భయంభయంగా విధులకు హాజరవుతున్నారు. ఇటీవలి కాలంలో వేలాదిమంది ఐటీ ఉద్యోగులు రోడ్డున పడ్డారు. కరోనా తర్వాత పెరిగిన ఉద్యోగుల ఊచకోత క్రమంగా పెరుగుతున్నదే తప్ప తగ్గుముఖం పట్టడం లేదు.

- హైదరాబాద్, నేటి ప్రస్థానం:


వివరాలు 2వ పేజీలో..


## 'మా అమ్మకు నానమ్మ, తాతయ్య నచ్చరు'

వార్షిక పరీక్షల్లో ఓ విద్యార్థి సమాధానం


4. My mother likes Sun flower and Black colour

5. My mother doesn't like grand father and grand mother


02




## 6 వేల మందిని రికార్డుల్లో చంపేసిన ట్రంప్ సర్కారు!

- తాత్కాలిక పర్మిట్‌తో అమెరికాలోకి వచ్చి తిరిగి వెళ్లకపోవడంతో నిర్ణయం
- పొమ్మన లేక కాదు వలసదారులను పొమ్మనే పొగబెట్టిన ట్రంప్
- రికార్డుల్లో మరణించినట్లు నమోదు.. సోషల్ సెక్యూరిటీ నంబర్ రద్దు
- తమకు తాముగా అమెరికా విడిచి వెళ్లేలా చేయడమే ట్రంప్ ఉద్దేశం


వివరాలు 2వ పేజీలో..


## నేషనల్ హెరాల్డ్ కేసులో ఆస్తుల స్వాధీనానికి ఈడీ రెడీ

- నేషనల్ హెరాల్డ్ కేసులో కీలక పరిణామం
- ఢిల్లీ, ముంబై, లక్నోలలోని ఆస్తులు జప్తునకు రంగం సిద్ధం


02








- ఫలవంతమైన కవిత్వ సృజన
- తెలుగు రుద్దకండి!
- బాల్య బంధం
- బతుకు బంధాలు


మీ సాహితీ ప్రస్థానంలో..

# ఉద్యోగాల ఊచకోత





- టెక్ కంపెనీల్లో ఉద్యోగాల తొలగింపు
- పింక్ స్లిప్‌లతో ఉద్యోగుల బేజారు
- ఉద్యోగుల్లో పెరుగుతున్న అభద్రాభావం
- వందలాదిమందికి గూగుల్ లేఆఫ్‌లు
- పెరుగుతున్న ఏఐ వాడకంతో ఉద్యోగాలకు ఎసరు
- ఆర్థిక మందగమనం మరోవైపు
- ఖర్చుల తగ్గింపు కారణాలతో జాబ్స్‌లో కోత

టెక్ కంపెనీలు ప్రాభవం కోల్పోతున్నాయి. ఒకప్పటి మోజు ఇప్పుడు వాటిపై ఉండటం లేదు. తమ జాబ్ ఎప్పుడు పోతుందో తెలియక ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ పనులు చేసుకుంటున్నారు. తాజాగా సెర్చింజన్ దిగ్గజం గూగుల్ కూడా తమ ఉద్యోగులపై పెద్ద ఎత్తు వేటు వేసింది. ఆర్థిక అస్థిరతతో గ్లోబల్ మార్కెట్లలో ఒత్తిడి, టారిఫ్ వార్, అమెరికాలో మాంద్యం భయాలు, లాభాల క్షీణత, ఏఐ వినియోగం పెరగడం.. వంటి కారణాలతో కంపెనీలు ఖర్చులు తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు 100 కంపెనీలు 27 వేల మందికిపైగా ఉద్యోగును ఇంటికి పంపాయి. తాజాగా గ్లోబల్ టెక్ దిగ్గజం 'గూగుల్' ఉద్యోగులకు లేఆఫ్‌లు ప్రకటించింది. ఇటీవల ఇన్ఫోసిస్ మైసూర్ క్యాంపస్ 700 మంది ఫ్రెషర్లను బయటకు పంపింది. ఇది దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వీరు మూడుసార్లు ఎవాల్యుయేషన్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదని, అందుకనే వారిని బయటకు పంపుతున్నట్లు సమర్థించుకుంది. తొలగింపునకు గురైన ఉద్యోగులందరూ కంటతడి పెట్టుకున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.


- హైదరాబాద్, నేటి ప్రస్థానం:

## ప్రధాన కారణాలు

- **గ్లోబల్ రిసెషన్ భయాలు:** అమెరికా, యూరప్ మార్కెట్లలో ఖర్చుల నియంత్రణ
- **ఏఐ, ఆటోమేషన్:** కొన్ని ఉద్యోగాలు మానవ శక్తిపై ఆధారపడాల్సిన అవసరం తగ్గడం
- **స్టార్ట్-అప్స్‌లో ఫండింగ్ లోపం:** కొత్త పెట్టుబడులు రాకపోవడం వల్ల ఉద్యోగాలు తగ్గిపోవడం
- **పనుల మొత్తం తగ్గడం:** అనేకమంది క్లయింట్లు తమ బడ్జెట్‌ను కుదించడంతో ప్రాజెక్టులు నిలిచిపోవడం
- **మార్కెట్ పోటీ:** కంపెనీలు లాభాల్లో ఉండేందుకు ఖర్చులు తగ్గించుకోవడం

## ఉద్యోగులపై ప్రభావం

ఉద్యోగాల తొలగింపు అనేకమంది మధ్యస్థాయి, ఫ్రెషర్లపై ప్రభావం చూపుతోంది. తొలగిస్తున్న ఉద్యోగులకు తెగదెంపుల పరిహారం అందించినా ఉద్యోగ భద్రతపై భయం పట్టుకుంటోంది. దీంతో కొత్త ఉద్యోగాల కోసం పోటీ పెరిగింది. అలాగే, వర్క్ ఫ్రం హెూం అవకాశాలు తగ్గాయి. భావోద్వేగ, ఆర్థిక ఒత్తిడి పెరిగింది.



## నాలుగు నెలల్లోనే రెండోసారి

ఆండ్రాయిడ్ సాఫ్ట్‌వేర్, పిక్సెల్ ఫోన్స్, క్రోమ్ బ్రౌజర్ విభాగాల్లో పనిచేస్తున్న వందలాది మంది ఉద్యోగులకు గూగుల్ తాజాగా లేఆఫ్‌లు ప్రకటించింది. సంస్థలోని ఓ వ్యక్తి ద్వారా లేఆఫ్స్ విషయం వెలుగులోకి వచ్చింది. అయితే, ఎంతమందిపై లేఆఫ్స్ ప్రభావం పడిందన్నది కచ్చితంగా తెలియరాలేదు. కాగా, గూగుల్ నాలుగు నెలల క్రితం అంటే 2024 డిసెంబర్‌లో 10 శాతం మంది ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించింది. అంతకుముందు ఏడాది (2023) జనవరిలో 12 వేల మంది ఉద్యోగులను గూగుల్ తొలగించింది. ఇటీవలి కాలంలో చిన్నా పెద్ద తేడా లేకుండా అన్ని కంపెనీలు పలు కారణాలు చూపుతూ పెద్దఎత్తున ఉద్యోగులను తొలగించాయి. ఈ ఏడాది సాంకేతిక రంగంలో 100 కంపెనీలు 27,762 మంది ఉద్యోగులను తొలగించాయి. అంతకుముందు ఏడాది టెక్ రంగంలో 549 కంపెనీలు 1,52,472 మంది ఉద్యోగులను ఇంటికి పంపాయి. 2023లో 1,193 కంపెనీలు 2,64,220 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికాయి.

## 2024-25లో ఉద్యోగ కోతల ఇలా..

| కంపెనీ పేరు | ఉద్యోగ కోతలు | సమయం | ముఖ్య కారణాలు |
|---|---|---|---|
| గూగుల్ ఆల్ఫాబెట్ | 12,000 | జనవరి 2024 | ఖర్చుల తగ్గింపు, ఏఐపై దృష్టి |
| అమెజాన్ | 27,000 | 2023-2024 | డిజిటల్ కామర్స్ మందగమనం |
| మెటా (ఫేస్‌బుక్) | 10,000 | 2024 | సంస్థ రీ-స్ట్రక్చర్ |
| యాక్సెంచర్ | 19,000 | 2023-24 | ఖర్చుల నియంత్రణ, క్లయింట్ ప్రాజెక్టుల తగ్గింపు |
| విప్రో | 4,000 | 2024 | ప్రాజెక్టుల లోపం, క్లయింట్ బడ్జెట్ కట్ |
| టీసీఎస్ | తక్కువ స్థాయిలో | 2024 | ఉద్యోగాల భర్తీ లేదు |
| ఇన్ఫోసిస్ | తక్కువ స్థాయిలో | 2024 | బెంచ్ సైజ్ పెరగడం |

### భవిష్యత్తు అంచనాలు

- 2025 మధ్య నాటికి స్థిరత్వం రావొచ్చు
- ఏఐ, డేటా సైన్స్ రంగాలలో ఉద్యోగావకాశాలు పెరుగుతాయి
- కొత్త టెక్నాలజీల్లో నైపుణ్యం ఉన్నవారికి డిమాండ్ పెరుగుతుంది
- ఫ్రెషర్లకు తాత్కాలికంగా కష్టమైన సమయమే కానీ, స్కిల్స్ పెంపుతో అవకాశాలు మెరుగవుతాయి

### ఉద్యోగులు ఏం చేయాలి?

- నూతన టెక్నాలజీలు నేర్చుకోవాలి. అంటే ఏఐ, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ వంటి వాటిపై పట్టు సాధించాలి.
- ప్రొఫెషనల్ నెట్‌వర్క్ పెంచుకోవాలి. అంటే లింక్డిన్, టెక్ ఈవెంట్స్‌పై దృష్టిసారించాలి.
- ఫ్రీలాన్స్, రిమోట్ వర్క్ ఛాన్స్‌లు ఎక్స్‌ప్లోర్ చేయాలి.
- ఫైనాన్షియల్ ప్లానింగ్ జరుపుకోవాలి.



# 'రాజీవ్ యువ వికాసం' దరఖాస్తు ప్రక్రియలో ఇబ్బందులు



**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు ప్రక్రియలో పలు సాంకేతిక సమస్యలు తలెత్తుతు న్నాయి. సర్వర్ లోపాలు తలెత్తడంతో దరఖాస్తు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఇంటర్నెట్ సెంటర్లు, మీసేవ కేంద్రాల వద్ద దరఖాస్తుదారులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. దరఖాస్తు చివరి దశకు చేరుకున్న సమయంలో సర్వర్ మొరాయించడంతో ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా, సాంకేతిక సమస్యల కారణంగా ఇదివరకే దరఖాస్తు చేసుకున్నట్లుగా చూపిస్తోందని పలువురు అభ్యర్థులు వాపోతున్నారు. దరఖాస్తు సమర్పించిన అనంతరం ఫారం డౌన్‌లోడ్ కావడానికి సైతం అధిక సమయం పడుతోంది. దీంతో దరఖాస్తుదారులు పదే పదే మీసేవ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు గడువు ఈ నెల 14న ముగియనుంది. సొంత వ్యాపారాలు ప్రారంభించాలనుకునే యువతకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా అర్హులైన వారికి ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు అందించనుంది.

# నేషనల్ హెరాల్డ్ కేసులో 700 కోట్ల ఆస్తుల స్వాధీనానికి ఈడీ రెడీ

- నేషనల్ హెరాల్డ్ కేసులో కీలక పరిణామం
- ఢిల్లీ, ముంబై, లక్నోలలోని ఆస్తులు జప్తునకు రంగం సిద్ధం




**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.700 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసేందుకు చర్యలు ప్రారంభించింది. నేషనల్ హెరాల్డ్‌ను ప్రచురించే ఏజేఎల్ సంస్థను యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ కొనుగోలు చేసింది. ఇందులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు 38 శాతం చొప్పున వాటా ఉంది. తాజాగా... ఢిల్లీ, ముంబై, లక్నో నగరాల్లో ఉన్న ఏజేఎల్ ఆస్తులను ఈడీ గుర్తించింది. వాటిని స్వాధీనం చేసుకునేందుకు ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద చర్యలు చేపట్టింది. జప్తు చేయనున్న ఆస్తుల్లో ఢిల్లీలోని హెరాల్డ్ హౌస్ కూడా ఉంది. గతంలోనే ఈ ఆస్తులను ఈడీ తాత్కాలికంగా జప్తు చేసింది. అయితే, ఇప్పుడు వాటిని పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమైంది. యంగ్ ఇండియన్ సంస్థ ఏజేఎల్ ఆస్తులను ఉపయోగించి రూ.18 కోట్ల నకిలీ విరాళాలు, రూ.38 కోట్ల నకిలీ అద్దెలు, రూ.29 కోట్ల నకిలీ ప్రకటనల ద్వారా అక్రమంగా డబ్బు సంపాదించిందని ఈడీ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ జరిగిందని ఈడీ దాదాపు నిర్ధారణకు వచ్చింది. అందుకే పీఎంఎల్ఏ కింద ఆస్తులను జప్తు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది.

# డిజిటల్ పేమెంట్స్‌కు అంతరాయం

## సర్వర్ డౌన్‌తో ఇబ్బందులు

**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** డిజిటల్ పేమెంట్ సర్వీసులకు అంతరయాం ఏర్పడింది. యునిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ సిస్టమ్ మొరాయించిన నేపథ్యంలో.. ఆన్‌లైన్ కస్టమర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెట్రోల్ బంకులు, షాపింగ్ మాల్స్, హాస్పిటల్స్, హౌటళ్ల వద్ద.. యూపీఐ పేమెంట్స్ నిలిచిపోయాయి. ఒకవేళ పేమెంట్ చేసినా.. ఎర్రర్ అని లేదా పెండింగ్ అని చూపించాయి. దేశవ్యాప్తంగా యూపీఐ సమస్యలు వచ్చినట్లు సోషల్ మీడియా యూజర్ల ద్వారా తెలిసింది. డౌన్‌డిటెక్టర్ వెబ్‌సైట్ ద్వారా యూఐపీ పేమెంట్ సమస్యలు వెల్లడయ్యాయి. ఆ వెబ్‌సైట్ ప్రకారం ఈరోజు మధ్యాహ్నం వేళ పేమెంట్స్ సమస్యలు తీవ్రంగా వచ్చినట్లు- తెలుస్తోంది. పేమెంట్స్ చేయడంలో సుమారు 66 శాతం మంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 34 శాతం మందికి ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ చేయడం కష్టంగా మారింది. చాలా వరకు బ్యాంకులు, యాప్‌ల్లో ఈ సమస్య తలెత్తింది. అయితే ఏ కారణం చేత .. యూపీఐ పేమెంట్స్ నిలిచిపోయాయో ఇంత వరకు స్పష్టం కాలేదు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కానీ దిగ్గజ యూపీఐ ఎ÷-లాట్‌ఫామ్స్ కానీ దీనిపై వివరణ ఇవ్వలేదు.



## బాల్య బంధం

అనుకుంటాం గానీ కొన్ని బంధాలను
నిర్వచించడం కూడా చాలా కష్టమే,
నీది కూడా అంతే..
చిన్నప్పుడు,
స్లిప్పర్ తెగి నడక తడబడుతుంటే, ఆదుకుని
అభయమిచ్చావు, నడకను సరి చేశావు..
ఆటల ప్రయాణంలో లేత అరికాలును
ముల్లు ముద్దాడి నపుడు ,
బ్రహ్మాస్త్రము వై,
 నా బాధనంతా తీసేశావు..
మొలదారానికి నీవుంటే ఎంత భరోసా,
గోళ్ళు శుభ్రం చేసే పదను నీదే,
చెవిగులిమిని చెవి పట్టి తరిమిన చెలిమి నీది..
చినిగిన చొక్కాను అతికించే అదును నీదే..
గుండీలు ఊడి అంగి పతంగియై ఎగురుతుంటే
కుదురుగా నిలబెట్టిన ఔదార్యం నీది..
ఆటల్లో నీవే
అడుగడుగున బాల్యపు బాటల్లో నీవే..
ఇప్పటి పిల్లల తరానికి నీవు
చీప్ వస్తువు, కానీ మా బాల్యంలో చీఫ్ వస్తువు
నీవు..
ఇప్పటికీ ఇంట్లో ఎప్పుడన్నా నీవు కనిపిస్తే
కటుకుమని నా బాల్యం నాకు వినిపిస్తుంది..
కాంటా !
ఈరోజు నీ దినోత్సవం అంట..
 అంటే మా బాల్యోత్సవమే కదా !



డాక్టర్ కాసర్ల
నరేష్ రావు,
9441406252

## బతుకు బంధాలు

అమ్మా అంటూ అనురాగముతో
పిలుస్తూ పెరుగుతాము
నాన్న అంటూ వెంటే తిరిగి
అన్ని నేర్చుకొని పెద్దవాళ్ళం అవుతాం

అన్నయ్యా అంటూ ప్రేమ తో
కొట్లాడుకుంటూ గడిపేస్తాము
స్నేహితులతో సరదాగా,
ముసలి వాళ్ళ తో ముచ్చటగా
సాగిపోతుంది కాలం

అన్నీ నేనే నువ్వే నేనే అంటూ
వివాహబంధం తో ఏకమై
నిండు నూరేళ్ల ప్రాణమై
ఒకరికొకరం అయిపోతాము
భార్యాభర్తలం

కన్నవారికి కట్టుకున్నవారి
ఆగమనంతో దూరమవుతాం

పిల్లల అల్లరి సందడులతో
కాలం ఎలా జరిగిపోతుందో
తెలియనంతగా మమేకం అవుతాము
బాధ్యతలు బరువు బంధాలమధ్య నలిగిపోతాము
ఏది ఎదురయినా అన్నీ సహనంతో
స్వీకరించి బ్రతుకు బండిని నడిపిస్తాము

ఇంతేనా ఇంకా అత్త, మామ, పిన్ని, బాబాయ్
అంటూ ఎనలేని
బంధాలు వస్తూనే ఉంటాయి
ఈ బ్రతుకులో బంధాలెన్నో
తుదకు ఇద్దరమే మిగులుతాము
ఆఖరికి ఒకరమే అయిపోతాము

ఒంటరిగా వచ్చి ఒంటరిగా నే వెళ్ళిపోతాము
ఏ బంధం శాశ్వతం కాదని తెలిసినా
వాటిలోనే లీనమవుతాము

ఎపుడూ మనతోడు మనమే
మన అంతరాత్మ
అంతరాత్మకు శక్తి ఇచ్చేది ఆ భగవంతుడు.



కే. సమత
బెల్లంపల్లి



# ఫలవంతమైన కవిత్వ సృజన

**ఈ మధ్య కాలంలో విస్తృతంగా ఉత్తమ కవిత్వం రాస్తున్న అతి కొద్దిమందిలో యరకల యాదయ్య ఒకరు. వ్యక్తిగతంగా సౌమ్యులు యాదయ్య. మంచి తనం, స్నేహశీలత ఆయనలోని సుగుణాలు. ఇప్పటికే రెండు కవితాసంపుటాలను వెలువరించిన ఆయన లేఖిని నుండి వచ్చిన తాజా కవితాసంపుటి 'లోకం పోకడ'. దీర్ఘకాలంగా కవిత్వ రచనను నిరంతరం కొనసాగిస్తూ వస్తోన్న యాదయ్య 2016లో 'అక్షరమాలలు' పేరుతో తొలి కవితా సంపుటిని ప్రచురించారు. పెట్టుబడిదారీ వ్యవస్థ, ఆధునిక జీవన విధానం మొదలైన అంశాలపై గేయాలు, కవితలు ఇందులో ఉన్నాయి. యాదయ్య రెండో కవితా సంపుటి 'శ్రమ పొదుగు' 2021 లో విడుదలైంది. శ్రమజీవుల వెతలు, శ్రమైక జీవన వైవిధ్యం, పర్యావరణం, అవినీతి మొదలైన వస్తువులపై రాసిన కవితలు ఇందులో ఉన్నాయి.**

**యాదయ్య వెలువరించిన తాజా కవితాసంపుటి 'లోకం పోకడ'. ఇది సామాజిక అంశాలపై రాసిన కవితల మణిహారమని ఈ పేరుతోనే తెలుస్తోంది. ఒక్కటి మినహాయిస్తే ఇందులోనివన్నీ మినీ కవితలే. వాటిలో దేనికీ శీర్షిక పెట్టకపోవడం ఈ సంపుటిలోని ప్రత్యేకత. సమకాలీన సమాజం, ఆధునిక జీవితం ఈ కవితల వస్తువులు. చివర్లో హైదరాబాదు నగరంపై చిన్నపాటి దీర్ఘ కవితను చేర్చడం ఇందులోని మరో ప్రత్యేకత.**

యరకల యాదయ్య కవితా శైలి తొలి కవితాసంపుటి వెలువడ్డ 2016 నుండి ఇప్పటివరకు ఈ ఎనిమిదేళ్ల కాలంలో ఎంతో పరిణతి సాధించింది. వస్తువు ఎంపిక, వైవిధ్యంగా రాయడం, భాషాప్రయోగాలు మొదలైన అంశాల్లో కూడా సానుకూల మార్పును గమనించవచ్చు. క్లుప్తత, గాఢత, వ్యక్తీకరణలో సూటిదనం పెరిగాయి.

"గల్లీలో లొల్లైతే పిలిచినా పోరు
పక్కనుండి చెవులకు పని చెప్పుతారు
విందులకు పిలుపు రాకున్నా
ముందే ఉంటారు
నోటికి విరామమివ్వరు"

ఈ మినీ కవితలో రెండు సందర్భాలను కవి వివరిస్తున్నారు. ఒకటి పక్క ఇంట్లోనో వీధిలోనో గొడవ జరిగే సందర్భం. రెండోది ఎక్కడో జరిగే విందు. ఈ రెండు సందర్భాలలో వ్యక్తులు స్పందించే తీరును





వివరించేందుకు రెండు వేర్వేరు శరీర భాగాలను సాధనాలుగా వాడుకోవడంలో కవి సమర్థత తేటతెల్లమవుతోంది. మొదటి సందర్భంలో చెవిని, రెండో సందర్భంలో నోటిని సాధనాలుగా కవి ఉపయోగించారు. వీధిలోని పోరు వినాలని చెవిని ఉపయోగించడంలో చూపే శ్రద్ధ గొడవను చల్లార్చడంలో ఉండదని కవి అభిప్రాయం. పైగా ఎక్కడో జరిగే విందు, వినోదాలకు వెళ్ళి భోజనాలు ఆరగించడంలో ఉండే ఆసక్తి వీధిలోని అభిప్రాయభేదాలను తగ్గించడంలో లేకుండా పోతోందన్న ఆవేదన ఈ వాక్యాల్లో ప్రస్ఫుటంగా కనబడుతోంది. ఇదే కవితలో 'గల్లీ-లొల్లి', 'విందు-ముందు' మొదలైన పదాలు భాషా ప్రయోగాల విషయంలో కవి యరకల యాదయ్య శ్రద్ధకు నిదర్శనంగా కనబడతాయి.

మరో కవితలో కింది విధంగా పేర్కొంటారు ఈ కవి.

"కొందరి దేహాలు
మసిబారితేనేజి
మరెందరెందరికో
మెరుగులు దిద్దబడతాయి."

ఈ కవితలోనూ రెండు చిత్రాలు కనబడతాయి. ఒకటి శ్రమ రూపం, మరోటి శ్రమ ఫలాన్ని అనుభవించే రూపం. ఇంత చిన్న కవితలో శ్రమ శక్తి విలువను సమర్థవంతంగా చెప్పగలిగారు యాదయ్య. దేహాలు మసిబారడం చీకటికి సూచన. మెరుగులు వెలుగుకు సూచన. వర్గ విభజనను ఎంతో నేర్పుగా కవి చెప్పడాన్ని ఇక్కడ గమనించవచ్చు. శ్రామికులు తాము చీకట్లో ఉంటూ కూడా ప్రపంచానికి వెలుగులు పంచుతున్నారన్న అభిప్రాయం ఇక్కడ వ్యక్తం కావడాన్ని గమనించవచ్చు.

"పాలకులు
సేవకులమని అనుకుంటే
ప్రజలు రాజులేగదా!
రాజుల సొమ్ము
రాళ్లపాలు ఒకనాడు
నేడు ప్రజల సొమ్ము పాలకుల పాలు"

ఈ రోజుల్లో రాజకీయాలు అవినీతిమయమయ్యాయి. దీనిపై కవి నిశిత పరిశీలన, సున్నిత విమర్శ ఈ పంక్తుల్లో కనబడతాయి. ఇక్కడ కూడా రెండు వర్గాలు కనబడతాయి. మొదటిది పాలకవర్గం. రెండోది పాలితవర్గం. ఈ రెండు వర్గాల మధ్య సొమ్ముల పంపిణీని సాధనంగా పెట్టుకుని పాలకవర్గాల అవినీతిని కవి ఇక్కడ ప్రస్తావిస్తున్నారు.

ఇలాంటి వర్గ రూపాలనే మరో కవితలోనూ కవి యాదయ్య విశ్లేషించడాన్ని కింద చూడవచ్చు.

"రసాయనాల దుర్గంధంతో
శ్రామికుల దేహం తడిసి ముద్దైతే
యాజమానుల సొగసంత
సెంటు సువాసనలతో
చల్లటిగాల్లో తేలియాడుతది
కార్మికుడి బతుకు
కంపెనీ గేటు దాటనంటది"

ఈ రెండు వర్గాల మధ్య కవి చెప్పిన తేడాలను కింద గమనించవచ్చు. వర్గం శరీరం/ రూపం విషయంలో కవి వాడిన పదంవాసన జీవిత స్థితి శ్రామికులు దేహం రసాయనాల దుర్గంధం కంపెనీ గేటు దాటదు యజమానులు సొగసుసెంటు సువాసనలు చల్లటి గాల్లో తేలియాడడంపై పట్టికను బట్టి కవి యరకల యాదయ్య సమర్థవంతమైన వ్యక్తీకరణ తీరును తెలుసుకోవచ్చు.

"మెచ్చుకోకున్న మేలే
కించపర్చకుంటే చాలు
మౌనం మీద రాళ్ళు విసిరితే
విరిగి పగిలి ముక్కలైన మనసును
అతికించుట ఎవ్వరి తరము?"

సమాజంలో ఒకరినొకరు తూలనాడడం, కించపరచడం ఎక్కువయ్యాయి. మౌనంగా ఉంటే కూడా ఓర్వలేకుండా ఉద్దేశ్యపూర్వకంగా కయ్యం పెట్టుకోవడం సర్వసాధారణమైపోయింది. అందుకే ప్రశంసించకపోయినా సరే కానీ చిన్న చూపు చూడవద్దని కవి కోరుకోవడాన్ని ఈ పంక్తుల్లో చూడవచ్చు. ఇక్కడ మౌనాన్ని మానవీకరిస్తున్నారు కవి. మనసు ముక్కలైతే అతికించడం సాధ్యం కాదని కవి అభిప్రాయంగా గమనించవచ్చు. సరళ పదాలతో సుస్పష్టమైన వ్యక్తీకరణను తమ కవితారీతిగా మలుచుకున్నారు యాదయ్య. తెలంగాణ యాసను తమదైన రీతిలో కవిత్వంగా మలుస్తోన్న కవి యాదయ్య. గ్రామీణ పలుకుబడులు, సామెతలతో ఫలవంతమైన కవిత్వ సృజన ఆయనది.

డాక్టర్ రాయారావు
సూర్యప్రకాశ్ రావు,
9441046839



# తెలుగు రుద్దకండి!



**నిన్న మొన్న వచ్చిన వార్త. హైదరాబాద్‌లో ఉంటున్న ఇతర రాష్ట్రాల వాళ్ళు మా పై తెలుగుని బలంవంతంగా రుద్దకండి అని నిరసన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్‌లో రెండవ భాషగా "తెలుగు "వద్దు అని. ఇంతకు ముందులా హిందీ/సంస్కృతం ఉండాలి అని. ఇది చాలా దారుణం/అన్యాయం కూడా. భాషా సంయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాక ఒక్కటిగా కలిసి ఉన్న, విడిపోయినా కూడా మాతృభాషని వద్దు అనడం చాలా విచారకరం.**

మన తెలుగు వాళ్ళు మొద్దు చర్మం కలవాళ్ళు. ఇసుమంత అయినా బాధ కానీ/విచారం కానీ లేదు ..పైగా "తెలుగు " రాదు మాకు అని చెప్పుకోవడం ఒక ఘనత గా భావిస్తున్న వెధవ సమాజం లో ఉన్నాము. నాకు తమిళ వాళ్ళు/కన్నడ/మరాఠా వాళ్ళు ఈ విషయము లో నచ్చుతారు. నేను ప్రేమిస్తాను వాళ్ళని, మిగతా విషయాల్లో నాకు నచ్చకపోయినా ఈ ఒక్క విషయము లో నా ఓటు వాళ్ళకే.. బెంగళూరులో ఖచ్చితంగా మిగతా రాష్ట్రాల వాళ్ళు దేశం వాళ్ళు ఖచ్చితంగా కన్నడం లోనే మాట్లాడాలి అని స్వచ్ఛందం గా పూనుకొని అమలు చేస్తున్నారు.

అలా చెయ్యమని నేను చెప్పను కానీ ..కనీసం మన దగ్గర ఉంటూ, మన వనరులని వాడుకుంటూ ఇక్కడి భాష ని, సంస్కృతి ని వద్దు అనడం ఖచ్చితంగా ద్రోహమే..

ఈ ఉత్తర దేశం వాళ్ళు వచ్చి ఇక్కడి మూలాల్ని , సంస్కృతుల్ని నాశనం చేస్తూ "హిందీ" ని బలవంతంగా రుద్దడం మాత్రం తప్పు కాదు. భాష విషయము లో నేను ఎప్పుడు లిబరల్ గానే ఉంటాను అలా అని నా సొంత భాష ని మర్చిపొమ్మంటే మాత్రం చచ్చినా ఒప్పుకోను. అయినా మన బంగారం మంచిది కాదు అన్నప్పుడు వేరే వాళ్ళని అని ఏమి లాభం.మన తెలుగు సన్నాసులకి మిగతా భాషలు అన్ని నచ్చుతాయి ఒక్క "తెలుగు" తప్ప.. ఈ విషయము లో ఎప్రవాసుల ఎ" తెలుగు భాష అభిమానాన్ని మెచ్చుకోవాలి.. బర్మా, థాయిలాండ్, మలేసియా , యూ ఎస్ ఏ, యూ కే లో గల తెలుగు సంఘాలు (అవి ఎన్ని రాజకీయాలతో కునారిల్లుతున్న సరే) కృషి ని మెచ్చుకోవచ్చు.

బయట దేశాల వాళ్ళు వచ్చి ఇక్కడి భాష ని, తెలుగు సౌందర్యాన్ని నెత్తిన పెట్టుకొని సంతోషం గా ఉంటె, మనం ఏంట్రా అంటే "పొరుగింటి పుల్లకూర" వెంబడి పరుగులు తీస్తాం.. మనకన్నా ఎన్నో రేట్లు వెనుకబడిన "ఒరిస్సా" వాళ్ళు వేయి రేట్లు మేలు. మొన్న పూరి/భువనేశ్వర్ వెళ్ళినప్పుడు చదువుకున్న వాళ్ళు కూడా వాళ్ళ భాష లోనే మాట్లాడారు తప్ప హిందీ లో మాట్లాడలేదు. పైగా మనం అక్కడ హిందీ మాట్లాడితే త్వరగా మోసపోతాము...వాళ్ళని చూసి అయినా నేర్చుకోండ్రా బాబు...

చివరగా చెప్పేది ఏమిటి అంటే, మిగతా రాష్టాల వాళ్ళు/దేశాలు మా తెలుగు నేల మీద సంతోషం ఉ ఒండండి ...వ్యాపారాలు చేసుకోండి తప్పులేదు ..కానీ ఇక్కడి భాష ని పాతి పెట్టే ప్రయత్నం చెయ్యకండి ....మా భాష నే మాట్లాడాలి అని గొంతు మీద కట్టి పెట్టి చెప్పము ...నిజానికి మా వాళ్ళ హృదయం చాలా మంచిది .....అర్థం చేసుకోండి.

పుష్యమి సాగర్
తెలుగు అభిమాని

నేటి ప్రస్థానం
తెలుగు దిన పత్రిక
APTEL/2013/54506
హైదరాబాద్
హైదరాబాద్
ఆదివారం
13.04.2025




# బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డిపై టీజీపీఎస్సీ పరువు నష్టం దావా

- గ్రూప్-1 ఫలితాల విషయంలో తప్పుడు ఆరోపణలు చేశారని నోటీసులు
- వారం రోజుల్లో సమాధానం ఇచ్చి, క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- లేదంటే పరువు నష్టం కేసులు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక

**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డికి టీజీపీఎస్సీ షాక్ ఇచ్చింది. గ్రూప్-1 ఫలితాల విషయంలో తమపై తప్పుడు ఆరోపణలు చేశారంటూ పరువు నష్టం దావా నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లో ఈ నోటీసులకు సమాధానం ఇచ్చి, క్షమాపణలు చెప్పాలని, లేదంటే పరువు నష్టం కేసులు, ఇతర క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించింది. ఇకపై టీజీపీఎస్సీపై రాకేశ్‌రెడ్డి ఎలాంటి ఆరోపణలు చేయవద్దని ఆ నోటీసుల్లో పేర్కొంది. సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెట్టవద్దని కూడా తెలిపింది.

### రాకేశ్ రెడ్డి ఏమన్నారు?

టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్‌లోని అన్ని పేపర్లను రీవ్యాల్యుయేషన్ చేయాలని ఏప్రిల్ 1న రాకేశ్ రెడ్డి డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణ, వాల్యుయేషన్‌లో తప్పిదాలు జరిగాయని, వాటిని సరిదిద్దుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. గ్రూప్-1లో తెలుగు మీడియం విద్యార్థులకు అన్యాయం జరిగిందని, 40 శాతం మంది విద్యార్థుల్లో టాప్ 500లో ఒక్కరు కూడా లేరని ఆయన అన్నారు. 45 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తే కేవలం 10, 15 కేంద్రాల్లోని అభ్యర్థులే టాపర్లుగా నిలిచారని, మిగతా కేంద్రాల్లోని వారు ఎందుకు లేరని ప్రశ్నించారు. ఏపీపీఎస్సీలో 6 వేల పేపర్లు దిద్దడానికి 40 రోజుల సమయం తీసుకుంటే, ఇక్కడ 20 వేల పేపర్లను తక్కువ సమయంలో ఎలా దిద్దగలిగారని రాకేశ్‌రెడ్డి ప్రశ్నించారు.



# 6 వేల మందిని రికార్డుల్లో చంపేసిన ట్రంప్ సర్కారు!

- తాత్కాలిక పర్మిట్‌తో అమెరికాలోకి వచ్చి తిరిగి వెళ్లకపోవడంతో నిర్ణయం
- పొమ్మన లేక కాదు వలసదారులను పొమ్మనే పొగబెట్టిన ట్రంప్
- రికార్డుల్లో మరణించినట్లు నమోదు.. సోషల్ సెక్యూరిటీ నంబర్ రద్దు
- తమకు తాముగా అమెరికా విడిచి వెళ్లేలా చేయడమే ట్రంప్ ఉద్దేశం


**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** అమెరికాలో నివసిస్తున్న 6 వేల మంది వలసదారులను ట్రంప్ ప్రభుత్వం రికార్డుల్లో చంపేసింది. వారంతా జీవించి ఉన్నప్పటికీ అధికారులు మాత్రం రికార్డుల్లో మరణించినట్లు అప్‌డేట్ చేశారు. దీంతో వారి సోషల్ సెక్యూరిటీ నంబర్ ఆటోమేటిక్‌గా రద్దవుతుంది. అమెరికాలో సోషల్ సెక్యూరిటీ నంబర్ అనేది తప్పనిసరి. అమెరికా పౌరులతో పాటు తాత్కాలికంగా ఆశ్రయం కోసం వచ్చిన వారికీ ప్రభుత్వం ఈ నంబర్‌ను కేటాయిస్తుంది. ఈ సోషల్ సెక్యూరిటీ నంబర్ లేదంటే వారు జీవించి ఉన్నా కూడా మరణించినట్లే పరిగణించబడతారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు పొందే అవకాశం వారికి ఉండదు. అంతేకాదు, ఉద్యోగం కానీ, ఏదైనా చిన్నపాటి పని కానీ చేసుకునే వీలు ఉండదు. వలసదారులు తమకు తామే అమెరికాను విడిచి వెళ్లిపోయేలా చేసేందుకు అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. 'పొమ్మన లేక పొగ బెట్టినట్లనేది' తెలుగు సామెత కానీ ట్రంప్ సర్కారు మాత్రం పొమ్మనే పొగ పెట్టినట్లు ఇలా రికార్డుల్లో వలసదారులను చంపేసింది. బైడెన్ ప్రభుత్వం అమలు చేసిన పలు కార్యక్రమాల ద్వారా సుమారు 90 వేల మంది వలసదారులు అమెరికాలో అడుగుపెట్టారని అధికారులు తెలిపారు. వారందరూ తాత్కాలిక ఆశ్రయం కోరి వచ్చినవారేనని వివరించారు. అయితే, గడువు ముగిసినా వారు స్వదేశానికి తిరిగి వెళ్లలేదని, అమెరికాలోనే ఉంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో వారందరినీ వెతికి పట్టుకుని వెనక్కి పంపడం శ్రమతో కూడుకున్నదని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ రికార్డుల్లో వారు చనిపోయినట్లు నమోదు చేస్తే సోషల్ సెక్యూరిటీ నెంబర్ రద్దయి వారంతట వారే అమెరికాను వీడుతారని అధికారులు భావించారు. ఇందులో భాగంగానే తాజాగా 6 వేల మంది వలసదారులను రికార్డుల్లో మరణించినట్లుగా నమోదు చేశారు.

# కేటీఆర్ వ్యాఖ్యలతో ఆ భూములు హెచ్‌సీయూవి కాదని తేలిపోయింది

- చామల కిరణ్ కుమార్ రెడ్డి
- ఐసీఐసీఐ బ్యాంకు రుణం ఇచ్చినట్లు కేటీఆర్ చెప్పడంలో వాస్తవం లేదు
- టీజీఐఐసీ ఫేస్ వాల్యూ చూసి 27 కంపెనీలు బాండ్లు కొనుగోలు చేశాయి




**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** ఐసీఐసీఐ బ్యాంకు రుణంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలతో కంచ గచ్చిబౌలి భూములు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానివో లేదా అటవీ శాఖకు చెందినవో కావని స్పష్టమైందని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ భూములపై ఐసీఐసీఐ బ్యాంకు రుణం ఇచ్చినట్లు కేటీఆర్ చెప్పడంలో వాస్తవం లేదని పేర్కొన్నారు. టీజీఐఐసీ ఫేస్ వాల్యూ చూసి 27 కంపెనీలు బాండ్లు కొనుగోలు చేశాయని తెలిపారు. ఆ విధంగా వచ్చిన నిధులే ఐసీఐసీఐ బ్యాంకు ద్వారా టీజీఐఐసీ ఖాతాలో జమ అయ్యాయని వెల్లడించారు. కేటీఆర్ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. పేద ప్రజలు సన్న బియ్యం అన్నం తింటుంటే బీఆర్ఎస్ నాయకులు ఓర్చుకోలేకపోతున్నారని చామల మండిపడ్డారు.




# 'మా అమ్మకు నానమ్మ, తాతయ్య నచ్చరు'

**వార్షిక పరీక్షల్లో ఓ విద్యార్థి సమాధానం**

**రాజన్న సిరిసిల్ల జిల్లా, నేటి ప్రస్థానం:** జిల్లాలోని చందుర్తి మండలంలోని ఓ పాఠశాలలో ఓ నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని ఆంగ్లంలో అడిగిన ప్రశ్నకు సమాధానం చాలా ఆసక్తిగా రాసింది. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నిన్నటి నుంచి వార్షిక పరీక్షలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఇంగ్లిష్ ప్రశ్నపత్రంలో 'మీ అమ్మకు నచ్చినది మరియు నచ్చని వాటి గురించి రాయుము' అని అడిగారు. దానికి ఓ విద్యార్థిని సమాధానం రాస్తూ.. 'మా అమ్మకు నానమ్మ మరియు తాతయ్య నచ్చరు' అని రాసింది. ఆ సమాధానం చూసి ఉపాధ్యాయులు ఆశ్చర్య పోయారు. నేటి కాలంలో ఇంట్లో కోడళ్లకు అత్తమామల పట్ల ప్రేమ ఏ విధంగా ఉందో విద్యార్థి సమాధానం ద్వారా అర్థమవుతోంది. నేటి చిన్న కుటుంబాలలో అమ్మ నాన్నలకు నానమ్మ తాతయ్యలు భారంగా మారారని విద్యార్థి సమాధానం సారాంశం. ఇంట్లో కోడళ్లు వృద్ధులతో నిరంతరం గొడవలకు దిగడం, కసురుకోవడం, వృద్ధులు వేరే చోట ఉండడం ద్వారా పిల్లలు ఈ సమాధానం రాశారని స్పష్టమవుతుంది. సీసీఈ విధానంలో ఈ సమాధానం కూడా సరైనదే అవుతుంది. ఈ క్రమంలో వృద్ధుల ఆదరణ ప్రశ్నార్థకంగా మారింది.



# కఫం కరిగించుకుందాం..

## ఊపిరి తీసుకుందాం!!

మన శ్వాసలో ఉన్న ఉఛ్వాస నిశ్వాసాలే మనం జీవించి ఉన్నామనడానికి నిదర్శనం. అవి సాఫీగా ఉంటే మనం ఆరోగ్యంగా ఉన్నామని అర్థం. అయితే ఊపిరితిత్తుల్లో చాలా కారణాల వల్ల కఫం ఏర్పడుతుంది. టీబీ, దగ్గు, ఉబ్బసం, ఆయాసం వల్ల కఫం ఏర్పడుతుంది. అలా కాకుండా మామూలుగా వానకాలంలో చల్లదనం వల్ల, ఎండాకాలంలో ఆకస్మాత్తుగా వచ్చే వానల మూలంగా దగ్గు, పడిశం, తుమ్ములు వచ్చి ఊపిరితిత్తుల్లో కఫం ఏర్పడుతుంది. దీని వల్ల శ్వాస ఇబ్బందులు తలెత్తి అనారోగ్య సమస్యలతో సతమతం అవుతాం.

- నేటి ప్రస్థానం, ఫీచర్ ఇన్‌చార్జి



### కఫాన్ని ఇలా తొలగించుకుందాం..

- లవంగం, అల్లం కలిపి కషాయం చేసి వడగట్టి తాగాలి. ఈ కషాయం నోట్లోని బ్యాక్టీరియాను చంపుతుంది. కఫాన్ని కరిగిస్తుంది.
- ఉదయాన్నే గోరువెచ్చని నీటితో నిమ్మరసం తయారు చేసి అందులో తేనె కలిపి తాగాలి.
- పైనాపిల్, కాన్‌బెర్రి జ్యూస్ తాగాలి.. పుదీనా ఆకులు నమిలి మింగాలి.
- రెండు టీ స్పూన్ల అల్లం రసం తాగితే ఎంతో ఉపశమనం ఇస్తుంది.
- పసుపు పొడిని నీటిలో వేసుకొని తాగాలి. కొద్దిగా పసుపును మింగాలి.
- గోరు వెచ్చని నీటిలో యూకలిప్టస్ ఆయిల్ వేసి ఆవిరి పట్టుకోవాలి.
- చాతీపై ఆముదాన్ని మర్దన చేస్తే ఎంతో రిలీఫ్‌గా ఉంటుంది.
- పొగ తాగడం.. గుట్కాలను తినడం మానేయాలి.
- ద్రాక్షరసంతో కఫం త్వరగా బయటికి వస్తుంది.
- నిమ్మచెక్క, ఉప్పు, మిరియాల పొడి చప్పరిస్తూ ఉండాలి.
- వేడి పాలల్లో పసుపు మిరియాల పొడి కలుపుకొని తాగాలి.
- మసాలా దినుసులు అంటే లవంగం, యాలకులు, దాల్చిన చెక్క లాంటివి వేడి చేసి పొడిగా మార్చి గోరు వెచ్చని నీటిలో వేసుకొని తాగాలి.
- నూనెలో వేయించిన పదార్థాలు, అతి చల్లని పానీయాలు అసలే తీసుకోకూడదు.
- వాయు ముద్ర వేసి ప్రతిరోజు 15 నుంచి 20 నిమిషాలు ప్రాణాపాయం, మెడిటేషన్ చేయాలి.
- ప్రతిసారి గోరువెచ్చని నీటిని తాగడం అలవాటు చేసుకోవాలి.